

బర్డ్‌ను భ్రష్టుపట్టించారు!

ప్రత్యేకాధికారి రెడ్డెప్ప రెడ్డిపై అవినీతి ఆరోపణలు
ఇంప్లాంట్ల కొనుగోలులో అవినీతి వెలుగులోకి
రికార్డులు స్వాధీనం చేసుకున్న స్టేట్ విజిలెన్స్

తిరుపతి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆర్థోపెడిక్ ఆస్పత్రి.అంతేకాదు మూడున్నర దశాబ్దాలుగా లక్షలాదిమంది జీవితాలలో వెలుగులు నింపిన దవాఖానా. అయితే గత వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను, సంస్థలను నాశనం చేసినట్టే తిరుపతిలోని ప్రసిద్ధ వైద్య విజ్ఞాన సంస్థ బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్)ను కూడా భ్రష్టు పట్టించేసింది. తెల్ల రేషన్ కార్డుంటే పైసా ఖర్చులేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు దొరికిన చోట ప్యాకేజీలు పెట్టి బేరాలాడారు. అడుగడుగునా రాజకీయ ప్రమేయం పెరిగిపోయింది. వైసీపీ నేతలు సిఫార్సు చేసిన వారికే కీళ్ల మార్పిడి ఆపరేషన్లు చేసేవారన్న ఆరోపణలొచ్చిన క్రమంలో రోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. వైసీపీ హయాంలో బర్డ్‌లో ప్రత్యేకాధికారిగా చేరి డైరెక్టర్‌గా చెలామణీ అయిన డాక్టర్ రెడ్డెప్ప రెడ్డిపై ఇటీవల ఏపీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దృష్టిపెట్టింది. ఆయన ఘనకార్యాలకు సంబంధించిన రికార్డులను విజిలెన్స్ అధికారులు మంగళవారం బర్డ్‌కు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు.

టీటీడీ నిర్వహణలో మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్న బర్డ్ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి గతి తప్పిపోయింది. బర్డ్‌కు కొత్త రెక్కలు తొడుగుతామని చెప్పుకొచ్చిన అప్పటి టీటీడీ అధికారులు సైతం రాజకీయ నాయకుల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. తాజా మాజీ డైరెక్టర్ డాక్టర్ రెడ్డెప్ప రెడ్డిపై నిధుల దుర్వినియోగంతో పాటు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారంటూ ఏపీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి నెలరోజుల క్రితం పెద్దఎత్తున ఫిర్యాదులందాయి. దీంతో రెడ్డెప్ప రెడ్డిని విచారణకు అనుమతించాలని గత నెలలో విజిలెన్స్ అధికారుల నుంచి టీటీడీ అధికారులకు మెమో జారీఅయింది. బర్డ్‌లో ఆయనకు విపరీతమైన అధికారాలు ఎవరిచ్చారు? ఇంప్లాంట్ల కొనుగోలులో ఆయన పాటించిన మార్గదర్శకాలు ఏమిటి? నోటిఫికేషన్ లేకుండా వైద్యులను ఎలా రెగ్యులర్ చేశారు? వైసీపీ సిఫారసు లేఖలతో కీళ్ల మార్పిడి కేసులు ఎన్ని చేశారు? తదితరాలపై విజిలెన్స్ అధికారులు ప్రత్యేకదృష్టి పెట్టినట్టు తెలిసింది.

● ఎవరీ రెడ్డెప్ప రెడ్డి?

అనస్థీషియాలో డిప్లొమా చేసిన రెడ్డెప్ప రెడ్డి వైసీపీ నేతల అండదండలతో 2021లో బర్డ్ ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. బర్డ్‌లో అప్పటివరకు లేని ప్రత్యేకాధికారి పోస్టును ఆయనకోసమే అప్పటి టీటీడీ పెద్దలు సృష్టించారు. వైసీపీ పెద్దల ఆశీస్సులతో బర్డ్‌లో రెడ్డెప్ప రెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అపోలో హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి గౌరవ డైరెక్టర్‌గా కొంత కాలం కొనసాగి తప్పుకున్నాక రెడ్డెప్ప రెడ్డి బర్డ్‌ను తనచుట్టూ తిప్పుకున్నారు. వైసీపీ నేతల సిఫారసు లేఖలకే కీళ్ల మార్పిడిలో ప్రాధాన్యత ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక కూడా రాజంపేట వైసీపీ నేత ఆకేపాటి అమరనాథ రెడ్డి ఇంట్లో బర్డ్ వైద్యబృందంతో వెళ్లి మెడికల్ క్యాంప్ నిర్వహించినట్టు తెలిసింది. మే 31న అధికారికంగా రెడ్డెప్పరెడ్డి బర్డ్ ప్రత్యేకాధికారిగా రాజీనామా చేశారు. అయితే మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందన్న ఆశతో జూన్ 4వ తేదీ ఎన్నికల ఫలితాలు వెలువడేంతవరకు బర్డ్ డైరెక్టర్ బంగ్లాలోనే ఉన్నారు. ఆయన అంచనాలు తారుమారు కావడంతో బంగ్లా ఖాళీ చేసి జూన్ 6న హైదరాబాద్‌కు వెళ్లిపోయి, అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సీఈవోగా చేరినట్టు సమాచారం.



● రెడ్డెప్ప రెడ్డిపై ప్రధాన ఆరోపణలివే...

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బర్డ్‌లో ఇంప్లాంట్స్ కొనుగోలుకు కూడా రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. ఐదారు కంపెనీలు అర్హత సాధించినా ఒక కంపెనీకే ప్రాధాన్యం ఇవ్వడం, అదికూడా రూ.5వేల ధర ఎక్కువ ఉన్న ఇంప్లాంట్లను కొనుగోలు చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం మూడు నెలల్లో ఆ కంపెనీకి చెందిన 366 ఇంప్లాంట్లను అమర్చారు. తక్కిన కంపెనీలవి 50లోపే వినియోగించారు.నాణ్యత లేకపోయినా, టెండరులో ఎక్కువ ధర ఉన్న ఇంప్లాంట్లనే కమీషన్ల కోసం వినియోగించారన్న అనుమానాలున్నాయి. బర్డ్‌లో కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న దాదాపు 17మంది ఆర్థోపెడిక్ సర్జన్లను నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులర్ చేశారని, దీనివెనుక పెద్దఎత్తున నగదు చేతులు మారినట్టు చెబుతున్నారు. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులకు వచ్చే పేషెంట్లతో మాట్లాడుకుని అక్కడ రూ.ఐదారు లక్షలయ్యే ఆపరేషన్ తిరుపతిలో అదే వైద్యులతో రెండు,మూడు లక్ష రూపాయలతోనే చేసేస్తామని బర్డ్‌కు తీసుకొచ్చి శస్త్ర చికిత్సలను చేసి పంపినట్టు తెలుస్తోంది. ఆయా ఆస్పత్రి వైద్యులను ఇక్కడికి గెస్ట్ డాక్టర్లుగా పిలిపించుకుని వారితో ఉచితంగా సర్జరీలు చేయించి శ్రీవారి ప్రోటోకాల్ దర్శనం చేసి పంపేవారన్న ఆరోపణలున్నాయి.

ఏర్పేడు సీఐపై ఎస్పీ సీరియస్

● నెంబర్‌గేమ్ ఆటగాళ్లపై చర్యలు తీసుకోలేదంటూ ఆగ్రహం

ఏర్పేడు, ఆగస్టు 20 : ఏర్పేడు మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోకపోవడం పట్ల సీఐ శ్రీరామ శ్రీనివాసులుపై ఎస్పీ సుబ్బరాయుడు సీరియస్ అయినట్లు సమాచారం. పాపానాయుడుపేటలో ఏటా ఆగస్టు మాసంలో నిర్వహించే ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఉత్సవాలకు పరిసర గ్రామాల నుంచి జనం హాజరవుతుంటారు.వీరిలో కొంతమంది డబ్బాలో చింతగింజలు పోసి ఆడే నెంబర్‌గేమ్ అనే ఆటను లక్షల రూపాయలు బెట్టింగ్ పెట్టి ఆడుతుంటారు.పోలీసులు నిఘా వుంచి చర్యలు తీసుకుంటుంటారు. ఈసారి పదిరోజులుగా జరుగుతున్న ధర్మరాజుల స్వామి ఉత్సవాల్లో కూడా నెంబర్‌గేమ్ నడుస్తోంది. ఈ ఆట ఆడేవారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ సుబ్బరాయుడు వారం రోజుల క్రితమే సీఐ శ్రీరామ శ్రీనివాసులును ఆదేశించారు.అయితే నెంబర్‌గేమ్ నిర్వాహకులతో కుమ్మక్కైన సీఐ అలాంటిదేమీ జరగడం లేదని ఎస్పీ కార్యాలయానికి సమాచారం ఇచ్చినట్లు చెబుతున్నారు.అయితే నెంబర్‌గేమ్ జోరుగా సాగుతోందన్న సమాచారంతో రేణిగుంట డీఎస్పీకి చర్యలు తీసుకోమని ఎస్పీ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో డీఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ప్రత్యేక నిఘా వుంచి నెంబర్‌గేమ్ ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.13,850 స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐ శ్రీరామ శ్రీనివాసులుపై ఎస్పీ సీరియస్ అయినట్లు సమాచారం.స్టేషన్‌కు సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన వారితో కూడా సీఐ అగౌరవంగా మాట్లాడుతున్నాడన్న ఆరోపణలున్నాయి.ఈ నేపథ్యంలో సీఐపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని సమాచారం.

న్యాయంకోసం

● నిరసన శిబిరంలోనే జూడాల ఓపీ సేవలు
● స్విమ్స్, రుయాస్పత్రుల్లో కొనసాగిన నిరసనలు



రుయాస్పత్రిలో జూడాలకు మద్దతుగా నిలిచిన వైద్య, పారా మెడికల్ విద్యార్థులు



స్విమ్స్‌లోని శిబిరంలోనే ఓపీ సేవలు అందిస్తున్న జూడాలు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 20: కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో మహిళా జూనియర్ డాక్టరుపై జరిగిన హత్యాచారంపై స్విమ్స్, రుయాస్పత్రిలోని జూనియర్ డాక్టర్లు (జూడాలు) వారం రోజులుగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలు మంగళవారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా స్విమ్స్ వద్ద ఏర్పాటు చేసిన నిరసన శిబిరంలోనే రోగులకు ఓపీ సేవలు అందించారు. రోగులు సైతం జూడాలకు మద్దతుగా నిలిచి, శిబిరం వద్దే వైద్య సేవలు పొందారు. అనంతరం డాక్టర్లపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలను రుయాస్పత్రిలో నాటక ప్రదర్శన ద్వారా తెలియజేశారు. ఓ వైద్యుడికి అన్యాయం జరిగితే దేశంలోని వైద్యులంతా ఐకమత్యంగా పోరాడాలని అప్పుడే డాక్టర్లకు రక్షణ ఉంటుందని వారు ఈ ప్రదర్శనతో పిలుపునిచ్చారు. జూడాలకు పారా మెడికల్ విద్యార్థులు, ఐద్వా, జనవిజ్ఞాన వేదిక నేతలు మద్దతు తెలిపారు.



న్యాయం కోరుతూ స్విమ్స్‌లో జూనియర్ డాక్టర్ల మానవహారం

హత్యాచారం అమానుషం : ఎమ్మెల్యే ఆరణి



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి, సుగుణమ్మ, కిరణ్‌రాయల్

జూనియర్ డాక్టరుపై హత్యాచారం అమానుషమని, దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్విమ్స్‌లోని జూనియర్ డాక్టర్లు మంగళవారం రాత్రి తిరుపతిలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్యేతోపాటు టీడీపీ, జనసేన తిరుపతి ఇన్‌చార్జులు సుగుణమ్మ, కిరణ్‌రాయల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటువంటి ఘటనకు పాల్పడిన నిందితులను తక్షణమే కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి అండగా నిలవాలన్నారు. అనంతరం స్విమ్స్ సర్కిల్ నుంచి మహతి ఆడిటోరియం.. అక్కడినుంచి తిరిగి స్విమ్స్ సర్కిల్ వరకు జూడాలు ర్యాలీ నిర్వహించారు. టీడీపీ, జనసేన నేతలతోపాటు స్థానికులు సైతం స్వచ్ఛందంగా పాల్గొని జూడాలకు మద్దతు తెలిపారు.

వేసవిని తలపిస్తున్న ఎండలు

● ఉక్కపోతతో అల్లాడిపోతున్న వృద్ధులు, పిల్లలు





ఎండలతో నిర్మానుష్యమైన రేణిగుంట పోలీసులైను వీధి - మధ్యాహ్నం పాఠశాలకు పిల్లలను గొడుగులతో తీసుకెళుతున్న తల్లి

రేణిగుంట,ఆగస్టు20:గడిచిన పదిరోజులుగా కాస్తున్న ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.ఆదివారం రేణిగుంటలో 38డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, సోమవారం 36డిగ్రీలు, మంగళవారం 29డిగ్రీలు నమోదైంది. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉండడంతో ఉక్కపోతతో వృద్ధులు,పిల్లలు అల్లాడిపోతున్నారు.ఇంటి నుంచిబయటకు రావాలంటే భయపడిపోతున్నారు. మధ్యాహ్నం 12గంటలకల్లా ప్రధానవీధులు ఖాళీగాదర్శనమిస్తున్నాయి. మరో పక్క అత్యవసర పనులమీద బయటకు వచ్చే ప్రజలు ఎండలకు తట్టుకోలేక కూల్‌డ్రింక్ షాపులకు పరుగులు తీస్తున్నారు.

పట్టపగలు నిమిషాల్లో దోచేశాడు!



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

తిరుచానూరు, ఆగస్టు 20: తిరుచానూరులో మంగళవారం ఉదయం 15 నిమిషాల వ్యవధిలో ఓ ఇంట్లో చొరబడ్డ బీరువాలో ఉన్న నగ, నట్ర ఎత్తుకెళ్లాడు.పోలీసుల కథనం మేరకు .. తిరుచానూరులోని కొత్త వీధిలో భారతి కుటుంబ సభ్యులతో నివాసం ఉంటోంది. పక్కనే టైలరింగ్‌షాప్ నడుపుతోంది. ఉదయం 10.30గంటల సమయంలో ఓ వ్యక్తి దర్జాగా మిద్దెపైకి వెళ్లి భారతి ఇల్లు గడియ తొలగించి బీరువాలో ఉన్న బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లాడు. కొంత సేపు తరువాత మిద్దె పైకి వెళ్లిన భారతి బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడివుండడం గమనించింది.చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు, క్లూస్‌టీం చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి నిందితుడి వేలిముద్రలను సేకరించారు. సమీపంలోని ఓ పాఠశాలలో ఉన్న వీడియో పుటేజీని పరిశీలించగా ఓ వ్యక్తి దర్జాగా మిద్దెపైకి వెళ్లి దొంగతనం చేసిన దృశ్యాలు లభ్యమైనట్లు తెలిసింది. భారతి ఇంట్లో సుమారు 12 సవర్ల బంగారు నగలు చోరీ జరిగినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

ఫ్రైడేని డ్రైడేగా పాటిద్దాం

కలెక్టర్ పిలుపు

తిరుపతి(విద్య), ఆగస్టు 20: ఫ్రైడేని డ్రైడేగా పాటిద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ దోమల దినం సందర్భంగా కలెక్టరేట్‌లో దీనికి సంబంధించిన బ్యానర్‌ను ఆవిష్కరించారు. దోమల వల్ల చికున్ గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు వ్యాప్తి చెందుతాయని, పరిసరాల పరిశుభ్రతతో నివారించవచ్చని చెప్పారు. ఇళ్లలో ఫ్రిడ్జ్, కూలర్లతోపాటు పాత టైర్లు తదితరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వర్షాలు ఎక్కువగా కురిసే సమయం కావడంవల్ల అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వసతి గృహాలను, బాలల సంరక్షణ కేంద్రాలను, గురుకుల పాఠశాలలు, విద్యాసంస్థలను అధికారులు తనిఖీ చేసి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీహరి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్యారాణి, వైద్యాధికారులు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో దాతలకు గదుల కేటాయింపు రద్దు

తిరుమల, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో దాతలకు గదుల కేటాయింపు రద్దు చేసినట్టు టీటీడీ తెలిపింది. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈక్రమంలో టీటీడీలోని వివిధ ట్రస్టులకు, పథకాలకు విరాళాలు అందించిన దాతలకు కేటాయించే గదులను రద్దు చేసినట్టు స్పష్టం చేసింది.అక్టోబరు 4న ధ్వజారోహణం, 12న చక్రస్నానం జరిగే రోజులు మినహా మిగతా రోజుల్లో దాతలను దర్శనానికి అనుమతిస్తారు.

మాతమ్మ మొక్కు తీరింది



పట్టువస్త్రాలు తీసుకు వస్తున్న సుధారెడ్డి

ఎర్రావారిపాలెం, ఆగస్టు 20: శాసనసభ ఎన్నికల్లో కూటమి పార్టీలు, చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నాని గెలుపొందడంతో దళిత టీడీపీ సానుభూతి పరురాలు సావిత్రమ్మ తమ కుల దైవం మాతమ్మ అమ్మవారికి పూజలు చేసి మొక్కు తీర్చుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నెరబైలు చింతకాయల హరిజన వాడకు చెందిన టీడీపీ సానుభూతిరాలు సావిత్రమ్మ చంద్రగిరి ఎమ్మెల్యేగా నాని ఎన్నికల్లో గెలవాలని మాతమ్మకు మొక్కుకుంది. ఆమె కోరిక ప్రకారం నాని గెలుపొందడంతో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కు తీర్చుకుంది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే నాని సతీమణి సుధారెడ్డి వందలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అన్నదానం చేశారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

దోమకాటు ఆరోగ్యానికి చేటు



దోమల నివారణపై ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

చంద్రగిరి, ఆగస్టు 20: దోమకాటు ఆరోగ్యానికి చేటు అని డాక్టర్ శిరీష అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం చంద్రగిరిలోవైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శిరీష మాట్లాడుతూ దోమల వలన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, బోదకాలు, మెదడువాపు, విషపూరిత జ్వరాలు వస్తాయని తెలిపారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని, దోమల నివారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంపీహెచ్‌ఈవో ఈశ్వరయ్య, సిబ్బంది శివయ్య, చింతామణి, వాసుదేవ, వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణం



రామచంద్రాపురం, ఆగస్టు 20: రామాపురం మహాభారత ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ద్రౌపదీ కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయంలో మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. మధ్యాహ్నం బ్రహ్మర్షి పీఠం ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. సాయంత్రం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఉత్సవమూర్తులను వధూవరులుగా అలకరించి, వేద మంత్రోచ్చరణల మధ్య కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలుగా మాజీ వైస్ ఎంపీపీ తేజోవతి, నరసింహారెడ్డి దంపతులు వ్యవహరించారు. ఆలయానికి టీడీపీ రాష్ట్ర నాయకులు సురా సుధాకర్‌రెడ్డి దంపతులు విరాళం అందజేశారు. రాత్రి మేళతాళాల నడుమ ఉత్సవమూర్తుల ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది.

కంటతడి పెట్టించిన ద్రౌపదీ మాన సంరక్షణ



ద్రౌపదీ వస్త్రాపహరణ దృశ్యం

రామచంద్రాపురం, ఆగస్టు 20: ఎన్‌ఆర్ కమ్మపల్లి మహాభారత ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి వెంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ద్రౌపదీ మానసంరక్షణ నాటకం సభికులను కంట తడి పెట్టించింది.ఆలయంలో విశేష పూజలు నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం మేళతాళల నడుమ ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగింది. ఆలయ ధర్మకర్త రమేష్‌బాబు, రవికుమార్, ప్రధాన అర్చకులు హరి ఆచారి పాల్గొన్నారు.

శుభగిరికి పలువురి శుభాకాంక్షలు



శుభగిరి నాయుడిని అభినందిస్తున్న సుబ్రహ్మణ్యం నాయుడు, గౌస్‌బాషా, రమేష్ నాయుడు తదితరులు

తిరుపతి రూరల్, ఆగస్టు 20: తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లెకి చెందిన స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ బొల్లినేని శుభగిరి నాయుడి జన్మదినం మంగళవారం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా భారీ కేక్‌ని కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు, టీడీపీ చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఎస్.గౌస్‌బాషా, చెర్లోపల్లె టీడీపీనేత విప్పర్ల రమేష్ నాయుడితోపాటు పలువురు అయన్ను కలసి దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

ఆర్గానిక్ లైవ్‌స్టాక్‌పై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో డాక్టర్ గంగరాజు, అధ్యాపకులు

తిరుపతి రూరల్, ఆగస్టు 20: ఎస్వీ వెటర్నరీ కళాశాలలో లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ విభాగం(ఎల్‌పీఎం)ఆధ్వర్యంలో ఐసీఏఆర్-ఎస్సీసబ్‌ప్లాన్ ఆర్థిక సౌజన్యంతో మంగళవారం ఎస్వీఆర్డ్ కళాశాల విద్యార్థులకు ఆర్గానిక్ లైవ్‌స్టాక్ అండ్ పౌల్ట్రీ ప్రొడక్షన్‌పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎల్‌పీఎం హెడ్ డాక్టర్ జి.గంగరాజు మాట్లాడుతూ.. సేంద్రీయ పశుగణ ఉత్పత్తుల ప్రాముఖ్యత, సేంద్రీయ ధ్రువీకరణపై వివరించారు. సేంద్రీయ మాంస ఉత్పత్తులపై డాక్టర్ రంగయ్య, సేంద్రీయ పాల ఉత్పత్తులపై డాక్టర్ డి.సురేష్‌బాబు విశదీకరించారు. సేంద్రీయ కోళ్ల ఉత్పత్తులపై డాక్టర్ తిరుపతిరెడ్డి, సేంద్రీయ పంది మాంస ఉత్పత్తులపై డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, సేంద్రీయ మాంస ఉత్పత్తులపై డాక్టర్ జి.విజయభాస్కర్‌రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల అసోసియేట్ డీన్ పి.జగపతిరామయ్యతో డాక్టర్ గంగరాజు కలసి శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌కి సర్టిఫికెట్లు అందజేశారు. ఎస్వీఆర్డ్ కళాశాల ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ విభాగ అధ్యాపకులు డాక్టర్ పి.నాగరాజు, డాక్టర్ పి.శ్రీవాణి, వృక్షశాస్త్ర విభాగ హెడ్ ఎ.సురేఖ, అధ్యాపకులు డాక్టర్ ఎం.సుధాకర్ పాల్గొన్నారు.

ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

గూడూరు అర్బన్, ఆగస్టు 20: అవినీతికి తావులేకుండా ఉపాధి పనులు చేపట్టాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 19 పంచాయతీల్లో గత ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.7కోట్ల వరకు పనులు జరిగాయన్నారు. సామాజిక తనిఖీల్లో రూ. 6.75లక్షల పనుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించి రికవరీ చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించామన్నారు. బాధ్యులుగా శివ, యోగేష్ అనే టెక్నికల్ అసిస్టెంట్లను, ఫీల్డ్ అసిస్టెంట్లు విజయలక్ష్మీ, సురేష్, మస్తాన్‌బాబు, శోభన్, మురళిలను సస్పెండ్ చేశామన్నారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, డీఎల్‌పీవో వెంకటరమణ, ఏపీవో పెంచలయ్య పాల్గొన్నారు.

ఎస్వీయూలో ఇన్‌చార్జి వీసీ తనిఖీలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 20: ఎస్వీయూ ప్రకాశం భవన్‌లో ఇన్‌చార్జి వీసీ అప్పారావు మంగళవారం తనిఖీలు చేశారు. హోం సైన్స్, ఆంత్రోపాలజీ, ఎకనమెట్రిక్స్, మ్యాథమెటిక్స్ విభాగాల్లో క్లాసులు, ల్యాబుల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థుల గైర్హాజరుపై ప్రశ్నించారు. క్లాసులు, ల్యాబులు క్రమశిక్షణగా సాగాలని కోరారు.





ఫొటోలను వీక్షిస్తున్న విద్యార్థులు - ఎస్పీకి జ్ఞాపిక అందజేస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఫొటో అనేది కళకు ప్రతిరూపం : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 20: ఫొటో అనేది కళకు ప్రతిరూపమని ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన ముగింపు వేడుకల్లో ఆయన ప్రసంగించారు. జీవితంలో కలకాలం గుర్తుండిపోయేది ఒక్క ఫొటో మాత్రమే అన్నారు. విధి నిర్వహణలో ఇబ్బందులుంటే తన దృష్టికి తేవాలని ఫొటోగ్రాఫర్లకు సూచించారు. అంతకుముందు ఫొటో ఎగ్జిబిషన్‌ను ఎస్పీ తిలకించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.గిరిబాబు, జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, కార్యదర్శి లావణ్యకుమార్, కోశాధికారి శివయ్య, ఎలక్ట్రానిక్ మీడియా మాజీ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే భవానీనగర్‌లోని సిల్వర్ ఓక్స్ స్కూలు విద్యార్థులు కూడా ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు

తిరుమల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 71,595 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 28,981 మంది తలనీలాలు సమర్పించారు.

విద్యార్థినికి అభినందన



తిరుపతి(విద్య), ఆగస్టు 20: బైరాగిపట్టెడలోని వీక్ష ది స్కూల్ విద్యార్థిని వైనైషిక సాంస్కృతిక విభాగంలో రాణించి రాయలసీమ రంగస్థలి అవార్డును సాధించిందని హెచ్‌ఎం ఆర్‌కే విమల తెలిపారు. కృష్ణదేవరాయ కళాదర్బార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నైషిక ప్రతిభ చాటి ఈ అవార్డు కైవసం చేసుకుందన్నారు. మంగళవారం స్కూల్‌లో నిర్వహించిన అభినందన సభలో విద్యార్థినిని చైర్మన్ డాక్టర్ టి.రామకృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ రాజుగౌడ్, అన్నమయ్య నాట్య కళా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్రీరామ్ బాబు తదితరులు అభినందించారు.

న్యాయవాది మృతికి సంతాపం

తిరుపతి(లీగల్), ఆగస్టు 20: తిరుపతి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు ప్రాంగణంలో న్యాయవాది గోశాల రమేష్‌బాబు మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రమేష్‌బాబు న్యాయవాదిగా రాణించిన తీరును కొనియాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గోపీచంద్, మార్టిన్, నాగపట్ల రాజగోపాల్, దినకర్, నెల్లూరు యోగానంద్ పాల్గొన్నారు.

ఎస్వీయూలో 23న జాబ్ మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 20: ఎస్వీయూలో ఈ నెల 23వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నారు. వర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. ఫ్లిప్‌కార్ట్, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఆటోమేటివ్ ప్రైవేట్ కంపెనీ, ఇండో ఎంఎం కంపెనీ, విహారి మార్కెటింగ్, పద్మావతి లాజిస్టిక్, డిక్సన్ కంపెనీలు పాల్గొంటాయి. సుమారు 700 ఖాళీలు ఉంటాయి. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదువుకున్నవారు అర్హులు. సమగ్ర వివరాలకు 95338 89902 నెంబరులో సంప్రదించాలని ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీనివాసులు కోరారు.

విద్యార్థులకు లైఫ్ స్కిల్స్ అవసరం



విద్యార్థులకు సూచనలిస్తున్న శ్రీధర్

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 20: ఇంజనీరింగ్ కోర్సులు చదివే విద్యార్థులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతోపాటు లైఫ్ స్కిల్స్ (జీవన నైపుణ్యాలు) ఎంతో అవసరమని తిరుపతికి చెందిన కౌటిల్య ఇన్‌స్టిట్యూషన్ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ ఏడాదిలో బీటెక్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఎంప్లాయిబులిటీ అండ్ లైఫ్ స్కిల్స్‌పై నిర్వహించే ఐదురోజుల ఓరియెంటేషన్-ఇండక్షన్‌లో భాగంగా రెండో రోజు కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరైన ఆయన ప్రసంగించారు. విద్యార్థులు తార్కిక ఆలోచనతో కూడిన పరిజ్ఞానం పెంచుకోవాలని చెప్పారు. ప్రిన్సిపాల్ ఆర్వీఎస్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.దామోదర్‌రెడ్డి,ట్రైనింగ్‌అండ్‌ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మురళి, కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మునిలక్ష్మి ప్రసంగించగా,అధ్యాపకులు పాల్గొన్నారు.

'శ్రావ్స్' సంస్థ ప్రారంభం



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 20: డాక్టర్ సోమేసుల స్వప్నరేఖ ఆధ్వర్యంలో శ్రావ్స్ (సర్వీస్ టు పీపుల్, రీసెర్చ్ ఫర్ సొసైటీ) ప్రారంభోత్సవం మంగళవారం యూత్ హాస్టల్లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్వీయూ పూర్వ రెక్టార్ భాస్కర్ మాట్లాడుతూ.. సేవ, పరిశోధన అనే రెండు అంశాలతో ఈ సంస్థ ఏర్పాటౌతోందన్నారు. అభయ క్షేత్రం నిర్వాహకులు తస్లీమా మాట్లాడుతూ.. సమాజంలో నిరాదరణకు గురవుతున్న వర్గాలను ఆదుకోవడానికి సేవా సంస్థలు ముందుకు రావాలన్నారు. సంస్థ వ్యవస్థాపకులు స్వప్నరేఖ మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా ఆలోచనల్లో ఉన్న ఆశయం నేడు ఫలించిందన్నారు. బాలకృష్ణ, సోమశేఖర్, రాజా, హరికృష్ణ, హమీద, ఉదయ్, మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సంక్షేమానికి పెద్దపీట: ఎస్పీ



హోంగార్డులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎస్పీ

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 20: హోంగార్డుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం అనారోగ్యంతో బాధపడుతున్న ఏడుగురు హోంగార్డులకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.34,993లను వారికి ఎస్పీ అందజేశారు. అదనపు ఎస్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

'క్యాన్సర్' వైద్య పరీక్షలు



తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 20: టాటా ట్రస్టు సహకారంతో నెహ్రూ నగర్‌లోని రాస్ క్లస్టర్ కార్యాలయంలో మంగళవారం క్యాన్సర్ నిర్ధారణకు వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా టాటా ట్రస్టు పీఆర్వో హేమంత్ పాల్గొన్నారు. దాదాపు 150మందికి బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రాస్ మహిళ పొదుపు సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాగరాజు, పద్మావతి, మంజునాథ్, మాధవి, భాగ్యలక్ష్మి, సుబ్బాలమ్మ, రత్నమ్మ, కావేరమ్మ పాల్గొన్నారు.

ఒక్క ఎంపీడీవోకు తప్పనిసరి

● మిగిలిన వారు నిబంధనల మేరకు బదిలీ

చిత్తూరు రూరల్, ఆగస్టు 20: జడ్పీలో బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. ఐదేళ్ల పాటు ఒకే చోట విధులు నిర్వహించిన వారి వివరాలను అధికారులు సేకరించారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాలో 65 మండలాలుంటే అందులో 48 మండలాలకు రెగ్యూలర్ ఎంపీడీవోలు ఉండగా మిగిలిన 17 మండలాలకు ఈవోఆర్డీలు, ఏవోలు ఇన్‌చార్జి ఎంపీడీవోలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ 48 మంది ఎంపీడీవోల్లో పుత్తూరు ఎంపీడీవో ఇందిరమ్మ మాత్రం ఒకే మండలంలో ఐదేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్నారు. దీంతో ఆమెకు బదిలీ అనివార్యమైంది. మిగిలిన వారు రెండు నుంచి నాలుగేళ్ల వరకు సర్వీసులు పూర్తి చేసుకున్నారు. వీరిని ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు బదిలీ చేయనున్నట్లు సీఈవో గ్లోరియా తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలోని పంచాయతీరాజ్‌లో మొత్తం ఏడుగురు డీఈలకు గాను ఇద్దరు ఐదేళ్ల సర్వీసులు పూర్తి చేసుకున్నారు. 14 మంది ఏఈలకు గాను 8 మంది.. ఆర్‌డబ్ల్యూఎస్‌లో 10 మంది డీఈలకు గాను ఇద్దరు.. 41 మంది ఏఈల్లో 10 మంది =ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నారు. జడ్పీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు 150 మంది ఐదేళ్లు పూర్తి చేసుకోవడంతో వీరందరికి బదిలీ తప్పదు.

చెత్తసంపద తయారీ కేంద్రాల సందర్శన



చెత్తనుంచి తయారైన ఎరువును చూపుతున్న సిబ్బంది

తిరుపతి రూరల్, ఆగస్టు 20: తిరుపతి రూరల్ మండలంలో పేరూరు, పెరుమాళ్లపల్లె గ్రామ పంచాయతీలోని చెత్తసంపద తయారీ కేంద్రాలను (సాలిడ్ వెస్ట్ ప్రాసెసింగ్ సెంటర్) మంగళవారం పలువురు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సందర్శించారు. పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో భాగంగా మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహించే మూడురోజుల శిక్షణా తరగతుల్లో భాగంగా రెండోరోజు మంగళవారం ఈ కేంద్రాలను పరిశీలించారు. ఎంపీడీవో రమేష్‌బాబు మాట్లాడుతూ చెత్తనుంచి సంపదని సృష్టించవచ్చని, దీన్ని అన్ని పంచాయతీల్లో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వానపాముల ద్వారా చెత్త ఎరువుగా తయారైన విధానాన్ని వివరించారు.రిసోర్స్‌పర్సన్లుగా చంద్రగిరి, పాకాల మండల ఈవోపీఆర్డీలు శశిరేఖ, మాలతీ వ్యవహరించారు. రూరల్‌ఈవోపీఆర్డీ గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి



తిరుపతి(కపిలతీర్థం), ఆగస్టు 20: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఘన నివాళి అర్పించారు. పాత కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. సిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, నేతలు శాంతి, నాగరాజు, త్రినాథ్‌గౌడ్, కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో ప్రాజెక్టు అసోసియేట్ పోస్టుకు ఇంటర్వ్యూ

తిరుపతి(వైద్యం), ఆగస్టు 20: స్విమ్స్‌లోని బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో ప్రాజెక్టు అసోసియేట్(1) తాత్కాలిక కాంట్రాక్టుకు సంబంధించి ఈనెల 24న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని, నెలకు రూ.25వేల వేతనంతోపాటు అరియర్స్ కూడా అందిస్తామని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు విద్యార్హత, బయోడేటా ఫారంతో ఈనెల 24న ఉదయం 10 గంటలకు పాత డైరెక్టరు కార్యాలయం ఆవరణలోని కమిటీహాలు వద్ద నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

విశ్రాంత ఆర్మీ మెకానిక్‌కు నివాళి

తిరుపతి (జీవకోన), ఆగస్టు 20: ఆర్మీ మెకానిక్‌గా పదవీ విరమణ పొందాక టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఎస్టీవీనగర్‌కి చెందిన భోజరాజు మంగళవారం మృతి చెందారు. ఆయనకు తిరుపతి టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి, గౌరవ సలహాదారుడు లక్ష్మణరావు, గౌరవాధ్యక్షుడు మల్లేశ్వర్, ఉపాధ్యక్షుడు ప్రభు, కార్యదర్శి జలంధర్, సహాయ కార్యదర్శి గురు ఆచారి, కోశాధికారి బాబు, కమిటీ ఇన్‌చార్జి సోమశేఖర్, కేశవ, జాకీర్, అరుణ్ తదితరులు నివాళి అర్పించారు.

వ్యాసాశ్రమంలో కలెక్టర్ తనిఖీలు

వంటగది, భోజన నాణ్యత, మంచినీటి సదుపాయాలపై అసంతృప్తి

45 రోజుల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలని ఆదేశం



వంటగదిని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఏర్పేడు, ఆగస్టు 20: ఏర్పేడు వ్యాసాశ్రమంలో నాలుగో తరగతి నుంచి డిగ్రీ వరకు నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. వంటగది, భోజన నాణ్యత, మంచినీటి సదుపాయాలపై పరిశీలించారు. పరిశుభ్రత పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 45 రోజుల్లో మళ్లీ ఆశ్రమాన్ని సందర్శిస్తానని, ఈలోపు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను అందించాలని వ్యాసాశ్రమం నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. అప్పటికీ సౌకర్యాలు మెరుగుపడకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లలకు నాణ్యమైన ఆహారం, రక్షిత మంచినీరు అందించాలని సూచించారు. విద్యార్థినులకు మంచి విద్య అందించడంతో పాటు గదుల్లో ఫ్లోరింగ్ మెరుగు పరచాలని, రక్షిత మంచినీరు అందించేలా ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే మరుగుదొడ్లకు నిరంతరం నీటిసదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని, పిల్లలకు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవడానికి ఒక ఏఎన్ఎంను నియమించుకోవాలన్నారు. వ్యాసాశ్రమాన్ని తరచూ తనిఖీ చేయాలని తహసీల్దారును కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, ఏర్పేడు తహసీల్దారు భార్గవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో వినూత్న స్కోర్ పోర్టల్ ప్రారంభం



సమావేశమైన శ్రీసిటీ అధికారులు

వరదయ్యపాళెం, ఆగస్టు 20: సుస్థిర అభివృద్ధి చర్యల్లో భాగంగా శ్రీసిటీ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతూ స్కోర్ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించింది. దీని ద్వారా పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థలో పరస్పర సహకార ఆర్థిక విధానాలను ముందుకు తీసుకెళ్లడం లక్ష్యంగా పెట్టుకుంది. మంగళవారం నిర్వహించిన వర్చువల్ లాంచ్ కార్యక్రమంలో వివిధ పరిశ్రమల పర్యావరణ నిర్వాహకులు, సీనియర్ సప్లై చైన్ ఎగ్జిక్యూటివ్‌లు హాజరయ్యారు. అమెరికాలోని మిచిగాన్ యూనివర్సిటీకి చెందిన సస్టైనబిలిటీ నిపుణులు డాక్టర్ సుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కాగా శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) సతీష్‌కామర్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. శ్రీసిటీ జనరల్ మేనేజరు డాక్టర్ పి.వెంకటేశ్వరన్ మాట్లాడుతూ స్కోర్ అనేది వనరుల భాగస్వామ్యం కోసం ఆన్‌లైన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తుందని, సమాచార మార్పిడి, పర్యావరణం, ఆర్థిక ప్రభావితమైన విషయ విశ్లేషణకు సహకారం అందిస్తుందన్నారు. మిచిగాన్ విశ్వవిద్యాలయంలో క్యాంపస్ వ్యర్థాలను తగ్గించడం, ఇతర అక్కడ అమలు చేస్తున్న సుస్థిర కార్యక్రమాలు, కార్యాచరణ పథకాలపై డాక్టర్ సుధాకర్‌రెడ్డి వివరించారు. పోర్టల్‌ను ప్రారంభించడంలో శ్రీసిటీ చొరవను ఆయన అభినందించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పోర్టల్ ప్రాముఖ్యతను ప్రస్తావించారు. స్కోర్ పోర్టల్ ద్వారా ఉదహరించబడిన శ్రీసిటీ జీరో-వేస్ట్ కార్యక్రమాలు, సుస్థిర చర్యల పట్ల తమ నిబద్ధతను తెలియజేయడంతోపాటు ఇతర పారిశ్రామికవాడలకు ఒక మోడల్ నిలుస్తాయన్నారు.

వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు చేయండి


తుడా వైస్ చైర్మన్‌కి ఉత్సవ కమిటీ వినతి



తుడా వైస్ చైర్మన్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 20: వినాయక చవితి సందర్భంగా గణేశుడి విగ్రహాల నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు చేయాలని తుడా వైస్ చైర్మన్ డాక్టర్ వెంకట నారాయణకు వినాయక చవితి మహోత్సవ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కమిటీ సభ్యులతో కలిసి కన్వీనర్ సామంచి శ్రీనివాస్ మంగళవారం తుడా కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సామంచి మాట్లాడుతూ.. 23 ఏళ్లుగా తమ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు దేశంలోని ప్రధాన నగరాలకు దీటుగా జరుగుతున్నాయని చెప్పారు. ఇందులో తుడా కీలక భూమిక పోషిస్తోందని వివరించారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా వచ్చేనెల 9వ తేదీన సామూహిక విగ్రహాల నిమజనోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. వినాయక సాగర్ వద్ద టీటీడీ, తిరుపతి నగరపాలక సంస్థ ఏర్పాట్లు చేస్తున్నాయని, తుడా పరిధిలోని చెన్నాయగుంట చెరువు, దామినేడు చెరువు, గొల్లపల్లె చెరువు వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. సభ్యులు శ్రీనివాస్, నవీన్, గుండాల గోపీనాథ్‌రెడ్డి, రెడ్డి బాబు తదితరులు పాల్గొన్నారు.

అరటి చెట్టు మధ్యలో గెల



గుడిపాల, ఆగస్టు 20: సాధారణంగా అరటి చెట్టుకు కొనభాగంలో గెలలు వస్తుంటాయి. మండలంలోని 197 రామాపురం దళితవాడకు చెందిన వేదమాణిక్యం ఇంటివద్ద అరటి చెట్టులో కాండం మధ్యలో గెల రావడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దీన్ని చుట్టుపక్కల జనం వింతగా చూస్తున్నారు.

వైద్యురాలిపై హత్యాచారం అమానవీయం



కోల్‌కతా ఘటనను నిరసిస్తూ రుయా ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్ల నాటక ప్రదర్శన

కోల్‌కతా ఘటనపై మహిళా వర్సిటీలో ఫ్లాష్ మాబ్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 20: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారం అమానవీయమని పద్మావతి మహిళా వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఉమ అన్నారు. ఈ ఘటనపై వర్సిటీలో ఫ్లాష్ మాబ్ ద్వారా వైద్య విద్యార్థులు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. నాటిక, మైమ్ ద్వారా మహిళలపై జరుగుతున్న దారుణాలను కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ.. రెండేళ్లుగా దేశంలో పెరిగిన డ్రగ్స్ వాడకమే మహిళలపై అఘాయిత్యాలకు కారణమా? అన్న కోణంలో ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇటువంటి దారుణ ఘటనలకు తావివ్వకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రిజిస్ట్రార్ రజని, డీన్ కాత్యాయిని, అధ్యాపకులు, వైద్య, వర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీ వైద్య కళాశాలలో 30న పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 20: ఎస్వీ వైద్య కళాశాలలో పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 30వ తేదీన ఉదయం 9.30 గంటలకు కళాశాలలోని సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి నిబంధనల మేరకు ఈ కౌన్సెలింగ్ జరుగుతుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ(డీఎంఎల్‌టీ) 30 సీట్లు, డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ (డీఏఎన్ఎస్) 30 సీట్లకు సంబంధించి ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. హాజరయ్యే విద్యార్థులు తమ విద్యార్హతకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు రెండు తీసుకురావాలన్నారు. సీటు పొందిన విద్యార్థులు అన్నిరకాల ఫీజులకు సంబంధించి రూ.7,700 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫీజు కట్టని వారి సీటు రద్దు చేస్తారని తెలిపారు. పూర్తి వివరాలు కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

24న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 20: ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఈనెల 24న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాబర్ట్ రాజనందన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆరోజున ఉదయం 6.30గంటలకు ఎస్వీయూ మైదానం చేరుకోవాలి. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ తీసుకురావాలి. అండర్-14, 16, 18, 20, 23 విభాగాల పోటీల్లో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేస్తారు. వీరు వచ్చేనెల 14నుంచి మూడ్రోజులపాటు గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు హాజరుకావాలి. మరిన్ని వివరాలకు 86868 67079, 96420 09767 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

27న తిరుమలలో గోకులాష్టమి ఆస్థానం

తిరుమల, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి):శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా తిరుమలలో ఈనెల 27వ తేదీన శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించనున్నారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి ముఖమండపంలో రాత్రి 8 నుంచి 10 గంటల వరకు గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బంగారు సర్వభూపాల వాహనంపై కృష్ణస్వామిని వేంచేపు చేసి నివేదనలు సమర్పిస్తారు. ఉగ్రశ్రీనివాసమూర్తికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, శ్రీకృష్ణస్వామికి ఏకాంత తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం ద్వాదశారాధన చేపడతారు. 28వ తేదీన సాయంత్రం 4 గంటలకు తిరుమలలో ఉట్లోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి మలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో విహరిస్తారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని 28వ తేదీన ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది.

శ్మశానవాటిక సమస్యను పరిష్కరిస్తాం: ఆరణి

తిరుపతి (జీవకోన), ఆగస్టు 20: తిమ్మినాయుడుపాళెం (టీఎన్‌పాళెం) హరిజనవాడ శ్మశాన వాటిక సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. స్థానికులు తమ సమస్యను ఎమ్మెల్యేకు తెలియజేయడంతో మంగళవారం ఆయన కాలనీ సమీపంలోని శ్మశానవాటికకు అనుకూలమైన స్థలాన్ని(ఎకో జోన్ ఫారెస్టు భూమి) పరిశీలించారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యకు వెంటనే పరిష్కారం లభించేలా చూస్తామని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, బి.జి.కృష్ణయాదవ్, కాయం వెంకటరత్నం, 50వ డివిజన్ అధ్యక్షుడు దండు విజయ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జక్కదానం చెంచమ్మకు నివాళి

టీఎన్‌పాళెం హరిజనవాడకు చెందిన జక్కదానం చెంచమ్మ మృతి చెందిన విషయం తెలియడంతో స్థానిక నేతలతో కలిసి ఆమెకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం నివాళి అర్పించారు. 2008లో చంద్రబాబు తిమ్మినాయుడు హరిజనవాడకు విచ్చేసినపుడు సహపంక్తి భోజనం చేశారు. ఆ సమయంలో జక్కదానం చెంచమ్మ కూడా బాబుతో కలిసి భోజనం చేశారు.



టీఎన్‌పాళెం హరిజనవాడలో సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆరణి

సమాజాన్ని చైతన్యవంతం చేసిన మాలతీచందూర్



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 20: మాలతీ చందూర్ సాహిత్యం సమాజాన్ని ఎంతో చైతన్యం చేసిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మాలతీ చందూర్ స్మారక సదస్సు పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ ఆర్ట్స్ డీన్ వాణి మాట్లాడుతూ.. అనేక సమస్యలకు తన సాహిత్యం ద్వారా మాలతీచందూర్ పరిష్కారాలను చూపారని అన్నారు. 1980-90 కాలంలో వంటల గురించి కొత్త కోడళ్లకు కూడా అవగాహన పెంచారని తెలిపారు. తెలుగు విభాగాధిపతి కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ.. మహిళలు ఎంత ఉన్నతంగా ఉండాలో కొన్ని పాత్రల ద్వారా తెలియజేశారన్నారు. మాలతీచందూర్ ట్రస్టు అందించిన రూ. 8 లక్షల విరాళంతో ఏటా క్రమం తప్పకుండా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. మిసిమి పత్రికా సంపాదకుడు వల్లభనేని అశ్వినీకుమార్ మాట్లాడుతూ.. పాఠకుల అనేక ప్రశ్నలను మాలతీ చందూర్ నివృత్తి చేశారని గుర్తు చేశారు. అన్ని కాలాలకూ జవాబులు వర్తించేవిగా ఉండటం ప్రత్యేకతన్నారు. వర్సిటీ ఇంగ్లీషు ప్రొఫెసర్ శారద మాట్లాడుతూ.. పెద్ద నవలను సంక్షిప్తంగా అందించడంలో గొప్ప నిపుణులని అన్నారు. మద్రాసుకు చెందిన డాక్టర్ యజ్ఞశేఖర్ మాట్లాడుతూ.. మాలతీచందూర్ రాసిన ప్రతి నవలలో స్త్రీని కేంద్ర బిందువుగా చేసుకున్నారని తెలిపారు. తెలుగు విభాగ అధ్యాపకులు డాక్టర్ వై.సుభాషిణి మాట్లాడుతూ.. మహిళలను అత్యంత చైతన్యం గల పాత్రలుగా తీర్చిదిద్దారని అన్నారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు డాక్టర్ డి.యువశ్రీ, డాక్టర్ లక్ష్మిప్రియ, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రశంసాపత్రాల పంపిణీ



తిరుపతి(క్రీడలు), ఆగస్టు 20: శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రిన్సిపాల్ ఎన్.వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ కమాండింగ్ ఆఫీసర్ ఆర్.కె.గోపరాజు, సీటీవో డాక్టర్ ఎ.ఉమామహేశ్వరి, పీఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సర్దుబాటును నిలిపేయాలి: ఆపస్

తిరుపతి(విద్య), ఆగస్టు 20: ఉపాధ్యాయుల సర్దుబాట్లను తక్షణం నిలిపి వేయాలని ఆపస్ జిల్లా సహాధ్యక్షుడు డాక్టర్ దేవరాజులు, ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి కోరారు. లేదంటే బహిష్కరణకు పిలుపు ఇస్తామని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్వాలిఫైడ్ ఎస్జీటీలను వారి ఇష్టాలతో పనిలేకుండా బలవంతంగా ఉన్నత పాఠశాలలకు కేటాయిస్తున్నారన్నారు. ఎస్జీటీలను ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేయడంలో వారి ఐచ్ఛికాన్ని పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

విజేతకు అభినందన



తిరుపతి(విద్య), ఆగస్టు 20: ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థి సీహెచ్ మిథిల్ నరేష్ కరాటే పోటీల్లో ప్రతిభ చూపాడని ప్రిన్సిపాల్ ప్రకాష్‌బాబు తెలిపారు. దక్షిణభారత కరాటే ఫెడరేషన్ ఆధ్వర్యంలో చెన్నై మైలాపూర్‌లోని మోన్ఫోర్ట్ ఇండోర్ స్టేడియంలో జరిగిన దక్షిణ భారత జోనల్ కరాటే చాంపియన్‌షిప్ పురుషుల జూనియర్ కుమిటే 76 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించినట్లు వివరించారు. దీంతో మంగళవారం మిథిల్‌ని ప్రిన్సిపాల్ అభినందించారు.

'డిక్సన్' ప్లేస్‌మెంట్లకు స్పందన



ఎంపికైన అభ్యర్థులతో అధికారులు

తిరుపతి(విద్య), ఆగస్టు 20: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇండస్ట్రీ కస్టమైజ్డ్ స్కిల్ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా తిరుపతి ఐటీఐ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు విశేష స్పందన లభించిందని ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా లేదా ఏదేని డిగ్రీ కోర్సులో ఉత్తీర్ణులైన యువతీ యువకులకు తిరుపతిలోని డిక్సన్ కంపెనీ ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహించిందని వెల్లడించారు. మొత్తం 97 మంది అభ్యర్థులు హాజరవగా, 65 మంది అసెంబ్లింగ్ లైన్ ఆపరేటర్స్ అప్రెంటీషిప్ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వెంకటరమణరాజు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి గంగాధర్, ఐటీఐ టీవో గణేష్, జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మహేష్, దిలీప్‌కుమార్, సునేష్, హిమబిందు, డిక్సన్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడే విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 20:విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక బుధవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు నగరంలోని సబ్‌డివిజన్లలో నిర్వహించనున్నారు. ●కేటీ రోడ్డు- బాలాజీకాలనీ, తిరుపతి నార్త్, వెస్ట్, రాజీవ్‌నగర్ ● శ్రీనివాసం ఈస్ట్-కొర్లగుంట, దామినేడు,మాధవనగర్, మంగళం రూరల్ ● తిరుచానూరు-తిరుపతి సౌత్, అవిలాల, ఆపరేషన్ సెక్షన్లలో ప్రజలు అర్జీలు సమర్పించి, సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఏఈ కె.వాసుదేవరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

27న తిరుమలలో గోకులాష్టమి ఆస్థానం

తిరుమల, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా తిరుమలలో ఈనెల 27వ తేదీన శ్రీవారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించనున్నారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి ముఖమండపంలో రాత్రి 8 నుంచి 10 గంటల వరకు గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బంగారు సర్వభూపాల వాహనంపై కృష్ణస్వామిని వేంచేపు చేసి నివేదనలు సమర్పిస్తారు. ఉగ్రశ్రీనివాసమూర్తికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, శ్రీకృష్ణస్వామికి ఏకాంత తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం ద్వాదశారాధనం చేపడతారు.28వ తేదీన సాయంత్రం 4 గంటలకు తిరుమలలో ఉట్లోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి మలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో విహరిస్తారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని 28వ తేదీన ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

30న ఎస్వీ వైద్య కళాశాలలో పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 20: ఎస్వీ వైద్య కళాశాలలో పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 30వ తేదీన ఉదయం 9.30 గంటలకు కళాశాలలోని సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అనుసరించి నిబంధనల మేరకు ఈ కౌన్సెలింగ్ జరుగుతుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ(డీఎంఎల్‌టీ) 30 సీట్లు, డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ (డీఏఎన్‌ఎస్) 30 సీట్లకు సంబంధించి ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. హాజరయ్యే విద్యార్థులు తమ విద్యార్హతకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు రెండు తీసుకురావాలన్నారు. సీటు పొందిన విద్యార్థులు అన్నిరకాల ఫీజులకు సంబంధించి రూ.7,700 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫీజు కట్టని వారి సీటు రద్దు చేస్తారని తెలిపారు. పూర్తి వివరాలు కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

24న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 20: ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఈనెల 24న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాబర్ట్ రాజనందన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆరోజున ఉదయం 6.30గంటలకు ఎస్వీయూ మైదానం చేరుకోవాలి. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ తీసుకురావాలి. అండర్-14, 16, 18, 20, 23 విభాగాల పోటీల్లో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేస్తారు. వీరు వచ్చేనెల 14నుంచి మూడ్రోజులపాటు గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు హాజరుకావాలి. మరిన్ని వివరాలకు 86868 67079, 96420 09767 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు

తిరుమల, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.3.89 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 71,595 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 28,981 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

'డిక్సన్' ప్లేస్‌మెంట్లకు స్పందన



తిరుపతి(విద్య), ఆగస్టు 20: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇండస్ట్రీ కస్టమైజ్డ్ స్కిల్ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా తిరుపతి ఐటీఐ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు విశేష స్పందన లభించిందని ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా లేదా ఏదేని డిగ్రీ కోర్సులో ఉత్తీర్ణులైన యువతీ యువకులకు తిరుపతిలోని డిక్సన్ కంపెనీ ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహించిందని వెల్లడించారు. మొత్తం 97 మంది అభ్యర్థులు హాజరవగా, 65 మంది అసెంబ్లింగ్ లైన్ ఆపరేటర్స్ అప్రెంటీషిప్ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వెంకటరమణరాజు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి గంగాధర్, ఐటీఐ టీవో గణేష్, జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మహేష్, దిలీప్‌కుమార్, సునేష్, హిమబిందు, డిక్సన్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నేడే

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 20: విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక బుధవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నగరంలోని సబ్‌డివిజన్లలో నిర్వహించనున్నారు. ● కేటీరోడ్డు- బాలాజీకాలనీ, తిరుపతి నార్త్, వెస్ట్, రాజీవ్‌నగర్ ● శ్రీనివాసం ఈస్ట్- కొర్లగుంట, దామినేడు, మాధవనగర్, మంగళం రూరల్ ● తిరుచానూరు-తిరుపతి సౌత్, అవిలాల, ఆపరేషన్ సెక్షన్లలో ప్రజలు అర్జీలు సమర్పించి, సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఏఈ కె.వాసుదేవరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రేషన్‌పై ఫిర్యాదులందితే డీలర్లపై చర్యలు

డక్కిలి, ఆగస్టు 20 : ప్రతి కార్డుదారుడుకీ సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసిల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో డీలర్లతో సమావేశమయ్యారు. లబ్ధిరుదారులు సరుకులు అందలేదని ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకొంటామన్నారు. డీలర్ల లైసెన్సు కాలపరిమితిని రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఎండీ ఆపరేటర్లు లేని ప్రాంతాల్లో ఇన్‌చార్జిలను నియమించినట్లు తెలిపారు. దేవునివెల్లంపల్లి గిరిజన కాలనీ, పాతనాలపాడుల్లో వీర్వోల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తామన్నారు. ఏడు రేషన్ షాపుల్లో కార్డుల మ్యాపింగ్ లలోగందరగోళం నెలకొందని డీలర్లు చెప్పారు. సివిల్‌సప్లయ్ డీటీ సంధ్య ఉన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

గూడూరు, ఆగస్టు 20: కొండాగుంటలో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంట ఎవ్యాధి టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం గాలికుంటువ్యాధి టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. వ్యాధి సోకిన పాడిపశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని టీకాల ద్వారా శాశ్వతంగా నివారించవచ్చునన్నారు. డాక్టర్ సుదర్శన్, శ్రీనివాసులురెడ్డి, రైతులు, పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

23న టెన్నికాయిట్ జిల్లా జట్టు ఎంపిక

గూడూరు అర్బన్, ఆగస్టు 20: స్థానిక ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈనెల 23న ఉమ్మడి నెల్లూరు జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ జిల్లా జట్టు ఎంపికలను నిర్వహించనున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్యామసుందర్‌రావు, కార్యదర్శి రమ్య మంగళవారం ఈమేరకు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికలకు హజరయ్యే విద్యార్థులు 2010 ఏప్రిల్ తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలని సూచించారు.

నేడు పోలేరమ్మ హుండీ నగదు లెక్కింపు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 20 : పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద పోలేరమ్మ హుండీని బుధవారం లెక్కిస్తున్నట్లు దేవదాయశాఖ ఈవో శాశ్యాంక్ తెలిపారు. హుండీ లెక్కింపు అనంతరం అమ్మవారి చీరలకు వేలంపాట వేస్తున్నట్లు ఈవో పేర్కొన్నారు.

బంగారు నగలు,నగదు చోరీ

తడ, ఆగస్టు 20 : తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. స్థానిక బీసీ కాలనీలో లోక్కు చెంచురత్నం రోజూ రాత్రి ఇంటికి తాళంవేసి మిద్దెపైననిద్రపోతుంటారు. సోమవారం రాత్రి నిద్రపోయి తెల్లవారుజామున కిందకు వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతోపాటు బీరువా తెరిచి ఉండటం గుర్తించాడు. బీరువాలో 9.5 సవర్ల బంగారు నగలు, రూ. 65 వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినటు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని సైకిలిస్టు దుర్మరణం



మృతుడు చంద్రయ్య

తడ, ఆగస్టు 20 : లారీ ఢీ కొని సైకిలిస్టు మృతి చెందాడు. స్థానిక బోడి లింగాలపాడుకు చెందిన ఉద్దండి చంద్రయ్య (54) స్థానికంగా ఉన్న పరిశ్రమలో పని చేస్తున్నాడు. రోజూ సైకిల్‌పై పరిశ్రమకు వెళ్లి వస్తుంటాడు. సోమవారం రాత్రి డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తుండగా బోడిలింగాలపాడు మలుపు సమీపంలో నెల్లూరు వైపు వెళ్తున్న ఐసర్ లారీ ఢీ కొట్టింది. చంద్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని వెంటనే చెన్నై ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గురుకులాల్లో అధికారుల పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

కోట, ఆగస్టు 20 : స్థానిక యానాదుల బాలికల గురుకులం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకులాలతోపాటు బాలికల ఉన్నత పాఠశాలల పరిసరాల పరిశుభ్రతపై అధికారుల బృందం ఫోకస్ పెట్టింది. తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో భవానీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నందకుమార్, ఎఈ హేమంత్‌కుమార్‌లతో కూడిన బృందం ఆయా గురుకుల పాఠశాలల్లో పారిశుద్ధ్యం, తాగునీరు సరఫరా, వసతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు వండిపెడుతున్న భోజనాలను నిశితంగా గమనించారు. మురుగుకాలువల్లో శానిటేషన్ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. తాగునీటి ట్యాంకుల్లో బ్లీచింగ్ చల్లి క్లోరినేషన్ చేయాలన్నారు. పలు అంశాలపై ఆయా ప్రిన్సిపాళ్లకు అధికారుల బృందం పలు సూచనలు, సలహాలు ఇచ్చింది.

ఆర్‌అండ్‌బీ ఆఫీసుకు ముఖం చాటేస్తున్న అధికారులు



కోట, ఆగస్టు 20 : ఇక్కడి రోడ్ల, భవనాల (ఆర్‌అండ్‌బి) సబ్ డివిజన్ కార్యాలయం నామమాత్రంగా మిగులుతోంది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు కోటలో చాలా కాలంగా ఈ కార్యాలయం ఉంది. మండలానికి ఒకరు చొప్పున అసిస్టెంట్ ఇంజనీర్ ఈ ఆఫీస్‌లో ఉండాలి. నాలుగేళ్లుగా ఇన్‌చార్జి ఏఈలే దిక్కయ్యారు. ఓజిలి, గూడూరులకు సంబంధించి ఆ ఇంజనీర్లు కూడా చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నెలల తరబడి సబ్ డివిజన్ కార్యాలయానికి బాధ్యులు రాకపోవడంతో ప్రజలు, కాంట్రాక్టర్లు విసిగిపోతున్నారు. సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, అటెండరు మాత్రమే విధులకు హాజరవుతున్నారు. గతంలో డీఈ స్థాయి అధికారి కూడా ఇక్కడ పనిచేయకుండా డివిజనల్ కార్యాలయానికే పరిమితమయ్యారు. ఆర్‌అండ్‌బి శాఖలోని ఏఈలు కూడా సముద్రతీర ప్రాంత మండలాలకు రావాలంటే విముఖత చూపుతున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి సబ్ డివిజన్ కార్యాలయంలో రెగ్యులర్ సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇలా ఉంటే ఆలనా 'పాలనా' ఎలా..?





ఓజిలిలో పెచ్చులూడుతున్న డిప్యూటీ తహసీల్దారు గది గోడలు - అధ్వానస్థితికి అద్దం పడుతున్న భవనం వెనుకభాగం

● శిథిలావస్థలో ఓజిలి,పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయాలు ● బిక్కుబిక్కుమంటూ విధుల నిర్వహణ

పెళ్లకూరు, ఆగస్టు 20: స్థానిక తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియనట్లుంది. ఈ కార్యాలయాన్ని నిర్మించి 30 ఏళ్లకు పైనే అవుతోంది. ప్రస్తుతం గోడలు బీటలు వారుతున్నాయి. శ్లాబు పెచ్చులూడుతోంది. ఫ్లోరింగ్ దెబ్బతింది. దీంతో ఇక్కడ విధులు నిర్వహించడానికి ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. తేలికపాటి వర్షానికి కార్యాలయం మొత్తం ఉరుస్తుండడంతో రికార్డులు తడుస్తున్నాయి. తహసీల్దార్ గది ప్రమాదకరంగా మారడంతో పక్కనే ఉన్న వ్యవసాయశాఖ కార్యాలయంలోకి మార్చి కార్యాకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనం నిర్మించాల్సి ఉంది. ఇటీవల ఓజిలిమండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గదిలో శ్లాబు పెచ్చులూడాయి. అలాంటి సంఘటన పెళ్లకూరులో జరగక ముందే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.



పెళ్లకూరు తహసీల్దార్ ఆఫీస్‌లో దెబ్బతిన్న ఫ్లోరింగ్

ముప్పై ఏళ్లలో మూడు పర్యాయాలు మరమ్మతులు

ఓజిలి: తహసీల్దారు భవనం 30 ఏళ్లకే కాలం తీరింది. 1994లో అప్పటి సీఎం నేదురుమల్లి జనార్దన రెడ్డి చేతుల మీదుగా ఈ భవనాన్ని ప్రారంభించారు. గత 10 ఏళ్ల నుంచి మరమ్మతుల కోసం ఎదురు చూస్తోంది. ఈ 30 ఏళ్లలో ఈ భవనానికి మూడు పర్యాయాలు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయినప్పటికీ శ్లాబు పెచ్చులూడి పడుతూనే ఉంది. గోడల నెర్రెలకు ప్యాకింగ్ చేసి పెయింటింగ్ పనులు చేసినా పెద్దగా ప్రయోజనం కనబడలేదు. ఈక్రమంలో ఈనెల 2న తహసీల్దార్ గదిలో శ్లాబు ఊడిపడిన విషయం విదితమే. దీంతో ఆ గదిని పూర్తిగా మూసివేసినట్టు డిప్యూటీ తహసీల్దారు మధుసూదనరాజు తెలిపారు.

విగ్రహ ధ్వంసం బాధ్యులను తక్షణమే అరెస్ట్ చేయాలి

● దళిత బహుజన ఐక్యవేదిక నాయకుల డిమాండ్



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో దళిత నేతలు

వెంకటగిరి, ఆగస్టు 20 : వెంకటగిరిలో అంబేడ్కర్ విగ్రహం తల భాగం నరికితే వంద రోజుల్లో తిరిగి నిర్మించామని, ధ్వంసం చేసిన నిందితులను పోలీసులు ఇప్పటికీ గుర్తించ లేకపోయారని దళిత బహుజన ఐక్య వేదిక కన్వీనర్ సహదేవయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహన్ని ఐక్యవేదిక నాయకులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా అవిగ్రహం తల నరికిన దోషులను పట్టుకుని శిక్షించాలని కోరారు. 13 దళిత సంఘాలు దళిత బహుజన ఐక్యవేదిక పేరిట ఏకమై వంద రోజుల్లో విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. నిందితులను పట్టుకోకపోతే తాము మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరించారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు ఏడీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంగిలాల రామచంద్రయ్య, ఎస్సీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధర్మయ్య, దళిత సంఘాల నాయకులు రామకృష్ణ, గోపాల్, మంగళపురి సురేష్, దాసరి వంశి, దనుం జయ,ఏలూరు రాజేంద్ర మాదిగ, మాల్లారం బాబు, చాతరాసి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

గూడూరు, ఆగస్టు 20: కోల్‌కతాలోని ఆర్జీకార్ వైద్యకళాశాలలో జూనియర్ మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచారం సంఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సునీల్ డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని మహిళా చట్టాలు అమలులోకి వచ్చినా ఏదో ఒక చోట మహిళలపై హత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. కోల్‌కతా ఘటన నిందితులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎడీఎస్‌యూ నాయకులు చరణ్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, హరిప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్ : డ్వామా పీడీ



రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాసప్రసాద్

గూడూరు అర్బన్, ఆగస్టు 20: అవినీతికి తావులేకుండా ఉపాధి పనులు చేపట్టాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 19 పంచాయతీల్లో గత ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.7కోట్ల వరకు పనులు జరిగాయన్నారు. సామాజిక తనిఖీల్లో రూ. 6.75లక్షల పనుల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించి రికవరీ చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించామన్నారు. బాధ్యులుగా శివ, యోగేష్ అనే టెక్నికల్ అసిస్టెంట్లను, ఫీల్డ్ అసిస్టెంట్లు విజయ లక్ష్మీ, సురేష్, మస్తాన్‌బాబు, శోభన్, మురళిలను సస్పెండ్ చేశామన్నారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, డీఎల్‌పీవో వెంకటరమణ, ఏపీవో పెంచలయ్య పాల్గొన్నారు.

చెత్తకుప్పలో తపాలా కవర్లు



తడ, ఆగస్టు 20 : ఉత్తరాలు చెత్తకుప్పలో కనిపించడంతో జనం ముక్కున వేలేసుకుంటున్నారు. అందులో ఏటీఎం కార్డులు, బ్యాంకుల్లో కుదువపెట్టిన బంగారం నోటీసులు వంటి విలువైనవి ఉత్తరాలు ఉన్నాయి. కొత్తకుప్పం తపాలా కార్యాలయానికి వచ్చిన ఉత్తరాలు బట్వాడా చేయకుండా పోస్టల్ ఉద్యోగులు రోజుల తరబడి తమవద్దే ఉంచుకున్నట్లుగా స్థానికులు ఆరోపిస్తున్నారు. తడ కొత్తకుప్పం సమీపాన గ్రామదేవత ఆలయం పక్కన గ్రామానికి చెందిన కవర్లు డెలివరీ చేయకుండా ఉంచుతున్నారు. గ్రామస్థులనే వచ్చి తీసుకోమంటున్నారు. దీంతో వాటికి భద్రత ఉండటంలేదని సర్పంచ్ చెబుతున్నారు. అయితే. మంగళవారం ఉదయం ఆలయ సమీపాన చెత్తలో ఈ ఉత్తరాలను గమనించిన గ్రామస్థులు విస్తుపోయారు. ఎవరో ఆకతాయిలు ఆ ఉత్తరాలను ఇలా పడేసి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఇంటింటికీ డెలివరీ చేయాలని చెబుతున్నా సిబ్బంది స్పందించలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పందుల స్వైర విహారం



టీటీడీ కల్యాణ మండపం వీధిలో పందులు

వెంకటగిరిటౌన్, ఆగస్టు 20: మున్సిపాలిటీలో పందులు స్వైర వీహారం చేస్తున్నాయి. టీటీడీ కల్యాణ మండపం, కాశీపేట, బంగారుపేట, ఎన్టీఆర్ కాలనీ, ఏపీటీఎఫ్ కాలనీ, తోలిమిట్ట, బొగ్గులమిట్ట, మాసాపేట తదితర ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీటి ప్రభావంతో దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయోమోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పందులు,కోతులు, కుక్కలను అరికట్టాలని పలుమార్లు అర్జీలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. తమకు మరిన్ని ఇబ్బందులు ఎదురుకాకముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గ్రామసభలను విజయవంతం చేయండి

తడ, ఆగస్టు 20 : మండలంలో ఈనెల 23న జరిగే గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో విజయకుమార్ కోరారు. 18 పంచాయతీల్లో ఈ గ్రామ సభలు జరుగుతాయన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల గుర్తింపు, తీర్మానాలను సభ దృష్టికి తీసుకువస్తామన్నారు.

ఇంటింటా బీఎల్‌ఓల సర్వే విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దారు జయజయరావు

కోట, ఆగస్టు 20 : బీఎల్‌వోలు ఇంటింటా సర్వేను వేగవంతం చేసి లక్ష్యాలను అధిగమించాలని తహసీల్దారు కటారి జయజయరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బూత్‌లెవల్ అధికారులకు ఓటరు నమోదు ప్రక్రియపై శిక్షణా తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో భవానీలు మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి అక్టోబరు 18 వరకు ప్రతి గ్రామంలోనూ ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితాలో ఫోటోలు సక్రమంగా రాకపోవడం, తప్పులు తడకలు ఉన్నట్లయితే గుర్తించి అక్కడిక్కడే పరిష్కారం చూపాలన్నారు. 1-1-2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా కొత్త ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకోసం గ్రామాల్లో బీఎల్‌వోలు ఇంటింటా తిరిగి ఓటు నమోదుపై స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు అల్లం మల్లికార్జున్‌రావు తదితరులు ఉన్నారు.

వెంకటగిరిటౌన్: ఓటు హక్కుపై బీఎల్‌వోలు ప్రతి ఇంటినీ సర్వే చేసి నివేదిక సమర్పించాలని తహసీల్దార్ మునిలక్ష్మీ అన్నారు. మంగళవారం స్థానిక బీఎల్‌వోలతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1.1.2005 నిండిని ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 వరకు 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు నమోదు, తప్పులు సరిదిద్దుకునే అవకాశం కల్పించారన్నారు. డీటీ యువరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

బీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీల గురించి వివరిస్తున్న నిర్వాహకులు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 20 : బాషా ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయని బాషా ఇంగ్లీషు మీడియం పాఠశాల కరస్పాండెంట్ బాషా తెలిపారు. పోటీలలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. ఆరోగ్యకరమైన పోటీతత్వం పెరగాలని,ఉన్నతస్థాయికి ఎంపికయ్యేలా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ రహమాన్, అసరత్, ప్రసాద్, అబుబకర్, షాహిద్, వెంకటేష్, సులేమాన్, సంజాయ్, రామమూర్తి, నారాయణ పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి టీడీడీ సహకారం



ఈవో కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

గూడూరు, ఆగస్టు 20: తమ నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి టీటీడీ నుంచి సహకారం అందించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కోరారు. మంగళవారం తిరుపతిలో టీటీడీ ఈవో శ్యామలరావును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో విశిష్టత కలిగిన పురాతన ఆలయాలు ఉన్నాయన్నారు. టీటీడీ ద్వారా వీటిని అభివృద్ధి చేసేందుకు సహకారం అందించాలని కోరామన్నారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడును కూడా కలిశామన్నారు. ఆయన వెంట శ్రీపతి బాబు తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లిలో వ్యాధులపై అవగాహన ర్యాలీ



వెంకటగిరిటౌన్, ఆగస్టు 20: ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బాలాయపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లియో మాట్లాడుతూ మురికి గుంటలు, టైర్లు, కొబ్బరి చిప్పలు, పాత కుండీలు, కుండలు వంటి వస్తువుల వల్ల దోమలు వృద్ధి చెందుతాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం బాలాయపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సిబ్బంది మునిరాజా, రాజేశ్వరి పాల్గొన్నారు.

శ్రీసిటీలో వినూత్న స్కోర్ పోర్టల్ ప్రారంభం



సమావేశమైన శ్రీసిటీ అధికారులు

వరదయ్యపాళెం, ఆగస్టు 20: సుస్థిర అభివృద్ధి చర్యల్లో భాగంగా శ్రీసిటీ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతూ స్కోర్ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించింది. దీని ద్వారా పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థలో పరస్పర సహకార ఆర్థిక విధానాలను ముందుకు తీసుకెళ్లడం లక్ష్యంగా పెట్టుకుంది. మంగళవారం నిర్వహించిన వర్చువల్ లాంచ్ కార్యక్రమంలో వివిధ పరిశ్రమల పర్యావరణ నిర్వాహకులు, సీనియర్ సప్లై చైన్ ఎగ్జిక్యూటివ్‌లు హాజరయ్యారు. అమెరికాలోని మిచిగాన్ యూనివర్శిటీకి చెందిన సస్టైనబిలిటీ నిపుణులు డాక్టర్ సుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కాగా శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) సతీష్‌కామర్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. శ్రీసిటీ జనరల్ మేనేజరు డాక్టర్ పి.వెంకటేశ్వరన్ మాట్లాడుతూ స్కోర్ అనేది వనరుల భాగస్వామ్యం కోసం ఆన్‌లైన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తుందని, సమాచార మార్పిడి, పర్యావరణం, ఆర్థిక ప్రభావితమైన విషయ విశ్లేషణకు సహకారం అందిస్తుందన్నారు. మిచిగాన్ విశ్వవిద్యాలయంలో క్యాంపస్ వ్యర్థాలను తగ్గించడం, ఇతర అక్కడ అమలు చేస్తున్న సుస్థిర కార్యక్రమాలు, కార్యాచరణ పథకాలపై డాక్టర్ సుధాకర్‌రెడ్డి వివరించారు. పోర్టల్‌ను ప్రారంభించడంలో శ్రీసిటీ చొరవను ఆయన అభినందించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పోర్టల్ ప్రాముఖ్యతను ప్రస్తావించారు. స్కోర్ పోర్టల్ ద్వారా ఉదహరించబడిన శ్రీసిటీ జీరో-వేస్ట్ కార్యక్రమాలు, సుస్థిర చర్యల పట్ల తమ నిబద్ధతను తెలియజేయడంతోపాటు ఇతర పారిశ్రామికవాడలకు ఒక మోడల్ నిలుస్తాయన్నారు.

వ్యాసాశ్రమంలో కలెక్టర్ తనిఖీలు

వంటగది, భోజన నాణ్యత, మంచినీటి సదుపాయాలపై అసంతృప్తి
45 రోజుల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలని ఆదేశం



వంటగదిని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఏర్పేడు, ఆగస్టు 20: ఏర్పేడు వ్యాసాశ్రమంలో నాలుగో తరగతి నుంచి డిగ్రీ వరకు నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. వంటగది, భోజన నాణ్యత, మంచినీటి సదుపాయాలపై పరిశీలించారు. పరిశుభ్రత పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 45 రోజుల్లో మళ్లీ ఆశ్రమాన్ని సందర్శిస్తానని, ఈలోపు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను అందించాలని వ్యాసాశ్రమం నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. అప్పటికీ సౌకర్యాలు మెరుగుపడకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లలకు నాణ్యమైన ఆహారం, రక్షిత మంచినీరు అందించాలని సూచించారు. విద్యార్థినులకు మంచి విద్య అందించడంతో పాటు గదుల్లో ఫ్లోరింగ్ మెరుగు పరచాలని, రక్షిత మంచినీరు అందించేలా ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే మరుగుదొడ్లకు నిరంతరం నీటిసదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని, పిల్లలకు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవడానికి ఒక ఏఎన్‌ఎంను నియమించుకోవాలన్నారు. వ్యాసాశ్రమాన్ని తరచూ తనిఖీ చేయాలని తహసీల్దారును కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, ఏర్పేడు తహసీల్దారు భార్గవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు చర్యలు తీసుకోండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 20: ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు చర్యలు తీసుకోవాలని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలను ఎంఈవో బాలయ్య కోరారు. మంగళవారం ఆయన ఎమ్మార్సీ కార్యాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో పదేళ్లు పైబడిన పిల్లలను గుర్తించి ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 23లోగా ప్రవేశాలకు చివరి తేదీ అన్నారు. ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు శ్రీకాళహస్తి పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల 9490464358, రాజా హైస్కూల్ 9849868934, వాణి విద్యామందిర్ 9394844658 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీలత

శ్రీకాళహస్తి, ఆగస్టు 20: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ వ్యర్థాలు, తోట వ్యర్థాలను కంపోస్టు చేసే విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.శ్రీలత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, కళాశాలలో గార్డెన్ వేస్ట్‌ను ఎలా కంపోస్టు చేస్తున్నారో వివరించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి, తిరుపతి ఏడీఏలు రమేష్‌రెడ్డి, భాస్కరయ్య, ప్రకృతి వ్యవసాయ నిపుణులు కన్నయ్యనాయుడు, గంగాధరం, పురపాలక సంఘ ఏఈ సింధు, అధ్యాపకులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 20: విద్యాహక్కు చట్టం ప్రకారం బడి ఈడు పిల్లలందరు తప్పకుండా పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవోలు రవీంద్రనాథ్ అన్నారు. మండలంలోని నీర్పాకోట గిరిజన కాలనీలో మంగళవారం పర్యటించారు. బడి మానివేసిన పల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంతో పాటు భోజనం అందిస్తారని తెలిపారు. బడి మానివేసిన విద్యార్థులకు అడ్మిషన్ కల్పించారు.

బెస్ట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా స్టార్‌కృష్ణ

ఏర్పేడు, ఆగస్టు 20: తిరుపతి మంగళం డిపోలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బహుజన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్ స్టార్ కృష్ణకు మంగళవారం జిల్లా ప్రజారవాణా అధికారి తిమ్మారెడ్డి చెంగలరెడ్డి బెస్ట్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా అవార్డు అందజేశారు. తన సహచర ఉద్యోగులను సమన్వయం చేసుకుని డిపో ఆదాయం పెంచడం, ప్రత్యేకించి తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులను నడపడంలో కృషి చేసినందుకు ఈ అవార్డు ప్రదానం చేశారు. తనకు అవార్డు రావడానికి సహకరించిన డిపో మేనేజరు జ్ఞానభాస్కర్, అవార్డు అందజేసిన ఆర్ఎం చెంగలరెడ్డికి స్టార్ కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

రాజీవ్‌గాంధీకి నివాళి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ బత్తెయ్యనాయుడు

శ్రీకాళహస్తి, ఆగస్టు 20: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తెయ్య నాయుడు ఆధ్వర్యంలో మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటముని, వీరరాఘవరెడ్డి, శివయ్య, గోపి, నాగూరయ్య, ఆర్ముగం, వెంకటేష్, మహేష్, భాస్కర్, వాణమ్మ, భానమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రావణ, నాయకులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

నేటినుంచి శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ త్రిదిన మహోత్సవాలు

వడమాలపేట, ఆగస్టు 20: వడమాలపేటలోని కావలి వీధిలో ఈనెల 21 నుంచి శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక త్రిదిన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎన్ఆర్ఐలు చమర్తిరాజు, శిరీష తెలిపారు. 21న బుధవారం అగ్ని ప్రతిష్ఠ, నవగ్రహ మండపారాధన లఘు, పూర్ణాహుతి, 22న గురువారం నవవిధ స్నపన, రాత్రి శిఖప్రతిష్ఠ, ఆధారపీఠ పూజ, యంత్రప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, 23న శుక్రవారం కుంభజల సంప్రోక్షణ, మహా కుంభాభిషేకం, విశేష ద్రవ్యాలతో అభిషేకం, సాయంత్రం శాంతి కల్యాణం, గ్రామోత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులు తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

వడమాలపేట, ఆగస్టు 20: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు సకాలంలో వేయించాలని పశు సంవర్ధకశాఖ ఉపసంచాలకురాలు ఉమామహేశ్వరి చెప్పారు. మంగళవారం టీసీ అగ్రహారంలో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకితే పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోతారన్నారు. పాలు తాగే దూడల్లో మరణాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. సకాలంలో టీకాలు వేయిస్తే పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి మురళీధర్ రెడ్డి, లోకనాథం, సిబ్బంది పాల్గొన్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 20: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. అలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం దాతలు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

రహదారిపైకి చొచ్చుకొచ్చి ప్రహరీ నిర్మాణం

కుర్రకాలువవాసుల అభ్యంతరం, పనుల నిలిపివేత ● ఇనుప ఊచలు తగిలి తరచూ ప్రమాదాలు



రోడ్డుపై ప్రహరీ నిర్మాణం కోసం వేసిన పిల్లర్లు

రేణిగుంట, ఆగస్టు 20: రేణిగుంట మండల పరిధిలోని కుర్రకాలువ నుంచి ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేటకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి చొచ్చుకువచ్చి ప్రహరీ నిర్మాణం చేపట్టడం పట్ల ఆ మార్గంలోరి గ్రామాల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కుర్రకాలువ నుంచి పాపానాయుడుపేట వెళ్లే మార్గంలో చాలా ఏళ్ల క్రితం 100 అడుగుల రోడ్డును ప్రభుత్వం నిర్మించింది. తిరుపతికి చెందిన ఓ వ్యక్తి కుర్రకాలువ సమీపంలోని ప్రధాన కూడలిలో సర్వే నెంబరు 216భూమి నుంచి రోడ్డుపైకి చొచ్చుకువచ్చి ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం తన భూమి చుట్టూ పిల్లర్లు వేశారు. కుర్రకాలువ గ్రామస్తులు అభ్యంతరం చెప్పడంతో పాటు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎల్లమండ్యం వీఆర్వోను వివరణ కోరగా ప్రహరీ పనులను అడ్డుకున్నామని, అయితే ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ సంయుక్తంగా సర్వే నిర్వహించగా పట్టాదారు లెక్కల ప్రకారం హద్దులు ఉన్నాయని, ప్రైవేటు స్థలంలో సైతం రోడ్డు వేశారని, అయితే ఎన్నో ఏళ్లుగా వాడుకలో ఉన్న రోడ్డుపై ఇప్పుడు ప్రహరం నిర్మించడం పట్ల స్థానిక గ్రామస్తులు అభ్యంతరం చెబుతున్నారని తెలిపారు. రాలు తెలుపుతున్నారన్నారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. కాగా, ప్రహరీ కోసం రోడ్డుపై వేసిన పిల్లర్ల ఇనుప ఊచలు రాత్రిపూట కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ పరిశ్రమ సేవలు అభినందనీయం: కలెక్టర్



శిక్షణ పొందిన వారికి ధృవపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి, ఆగస్టు 20: సామాజిక సేవా, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ పరిశ్రమ అందిస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం నిర్వహించిన వాలిడిక్టోరియస్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన ఉచిత టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ లిటరసీ విభాగాల్లో శిక్షణ పూర్తి చేసిన మహిళలు, విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు సమీప ప్రాంతాల్లోని యువతలో స్కిల్ డెవలప్‌మెంట్ పెంచేందుకు ఇంటింటి సర్వే చేపట్టాలని సూచించారు. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశ్రమలన్నీ సీఎస్ఆర్ నిధులతో ఖచ్చితంగా అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు. గ్రామాల్లోని డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి వారికి వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి అవకాశాలు పెంపొందించేందుకు కృషి జరుగుతోందని చెప్పారు. విదేశాల్లో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో సామర్థ్యాలను గుర్తించి తగిన విధంగా నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇస్తున్నారని, ఆ దిశగా మనం కూడా నడవాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. గోశాలకు, సోషల్ ఫారెస్టు అభివృద్ధి కోసం అవసరమైన బంజరు భూములను పరిశ్రమకు కేటాయించాలని ఆర్డీవో రవిశంకర్‌రెడ్డిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు డొరైరాజ్, పీఆర్వో అభిషేకం తదితరులు పాల్గొన్నారు.

బలమైన చట్టాలతో నిందితులను శిక్షించాలి



మహిళల నిరసన ప్రదర్శన

శ్రీకాళహస్తి, ఆగస్టు 20: బలమైన చట్టాలతో నిందితులను శిక్షించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత అన్నారు. పట్టణంలో మంగళవారం కోల్‌కతాలో డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు నిరసనగా జనసేన ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ 500మంది మహిళలతో వంద మీటర్ల పొడవు గల నల్లజెండాతో పట్టణ వీధుల్లో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా కోట వినుత మాట్లాడుతూ డాక్టర్ హత్య కేసులో నిందితులను తక్షణమే బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల అఘాయిత్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో విప్లవాత్మకమైన చట్టాలను తీసుకువచ్చిన ప్రదానమంత్రి నరేంద్రమోదీ మహిళలపై అఘాయిత్యాల విషయంలో బలమైన చట్టాలను తేవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నేతలు గాయత్రి, రాజ్యలక్ష్మి, శారద, కవిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

నెంబర్‌గేమ్ జూదంపై పోలీసుల దాడి

ఆరుగురి అరెస్టు
రూ.13,850 స్వాధీనం

ఏర్పేడు, ఆగస్టు 20: ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో వారం రోజులుగా ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో పాపానాయుడుపేట పరిసర గ్రామాల నుంచి కొంతమంది జూదరాయళ్లు నెంబర్‌గేమ్ ఆడుతున్నారు. సమాచారం తెలుసుకున్న రేణిగుంట డీఎస్పీ వెంకటాద్రి తన సిబ్బందితో దాడులు చేశారు. నెంబర్ గేమ్ జూదమాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని రూ.13,850 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

తల్లిపై కుమారుడి దాడి

కేసు నమోదు

ఏర్పేడు, ఆగస్టు 20: మద్యం మత్తులో తల్లిపై కుమారుడు దాడి చేసిన ఘటన ఏర్పేడు మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు... మండలంలోని పంగూరు దళితవాడకు చెరందిన ఆదిలక్ష్మి, నాగూరయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, పెద్ద కుమారుడు యుగంధర్ తరచూ మద్యం తాగి తల్లిదండ్రులపై దాడికి పాల్పడేవాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి యుగంధర్ అతిగా మద్యం తాగి తల్లి ఆదిలక్ష్మిపై ఇనుప రాడ్డుతో దాడి చేయడంతో ఆమె గాయపడింది. మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో యుగంధర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

పీఏసీఎస్ సభ్యులు కేవైసీ చేసుకోవాలి

సత్యవేడు, ఆగస్టు 20: సహకార పరపతి సంఘాల్లో రైతులు సభ్యులుగా కొనసాగాలంటే కేవైసీ చేసుకోవాలని సత్యవేడు పీఏసీఎస్ చీఫ్ ఎగ్జిక్యుటివ్ ఆఫీసర్ శరత్‌కుమార్ అన్నారు. ఇందుకోసం ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్, రెండు ఫొటోలు, ఫోన్ నెంబరు, భూమి పాస్‌బుక్ జిరాక్స్, నామినీ వివరాలు సంఘ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మత్తు నుంచి యువతను కాపాడండి

వరదయ్యపాళెం, ఆగస్టు 20: మత్తు నుంచి యువతను కాపాడాలని సత్యవేడు సీఐ మురళిని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు కోరారు. వరదయ్యపాలెం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇతర రాష్ట్రాల నుంచి శ్రీసిటీలోకి వస్తున్న వారి ద్వారా పరిసర మండలాల్లో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. పోలీసులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

వృద్ధాశ్రమంలో తనిఖీలు



రికార్డులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు

పిచ్చాటూరు, ఆగస్టు20: పిచ్చాటూరులోని వృద్ధాశ్రమాన్ని తహసీల్దార్ రమేష్‌బాబు మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను, ఆశ్రమ ఆశ్రమంలో గదులు, వంటశాలను పరిశీలించారు. శుభ్రత పాటించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆశ్రమ అధికారి త్యాగరాజుతో మాట్లాడుతూ వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు నాగభూషణం, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

నేటి బంద్‌ను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 20: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేక పోరాటంలో భాగంగా బుధవారం జరిగే భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని జైభీమ్ ఆర్మీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి శ్రీకాంత్ కోరారు.

బీసీ బాలుర వసతి గృహంలో తనిఖీలు



బాలుర వసతిగృహాన్ని పరిశీలిస్తున్న వైద్య బృందం

ఏర్పేడు, ఆగస్టు 20: ఏర్పేడు బాలుర వసతిగృహాన్ని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య బృందం మంగళవారం తనిఖీ చేసింది. వైద్యాధికారిణి గిరిజా ప్రకాశం తన సిబ్బందితో కలిసి వసతి గృహంలోని వంటగది, స్నానపు గదులు, మరుగుదొడ్లు, నీటి నిల్వ తొట్టి, ఆహార దినుసులు, మెనూ పట్టిక, పరిసరాల శుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపట్ల అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడానికి ఇవ్వాలని వసతిగృహ సంమేమాధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి పల్లా వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో సుబ్బరాయుడు, ఆశా వర్కర్ గీత, వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన

శ్రీకాళహస్తి, ఆగస్టు 20: తొట్టంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాలతో స్టెప్స్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టెప్స్ సంస్థ మేనేజరు భాస్కర్ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంబంధం శెట్టి, ఏఎన్ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు, ఆశా వర్కరు భారతి పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధికి టీకాలు

పిచ్చాటూరు, ఆగస్టు 20: మండలంలోని కొత్తగొల్లకండ్రిగ, పాత గొల్లకండ్రిగ, శివగిరి పంచాయతీల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజుల మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు తీవ్రమైన జ్వరం, నోటి పుండ్లు, కాలి పుండ్లు, నీరసించిపోవడం, పాలు తాగే దూడలు మరణించడం జరుగుతుందన్నారు. నాలుగు నెలల పైబడిన పశువులకు తప్పకుండా టీకాలు వేయించుకోవాలని సూచించారు. విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్ కె.విజయకుమార్ పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సీఐ మురళిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

వరదయ్యపాళెం, ఆగస్టు 20: వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సత్యవేడు సీఐ మురళిని టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నిర్మల్, శ్రీనివాసులు నాయుడు, మల్లికార్జున నాయుడు, కిరణ్‌కుమార్, హరి చౌదరి, అజయ్, శరవణ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారును కలిసిన టీడీపీ నేతలు

వరదయ్యపాళెం, ఆగస్టు 20: సత్యవేడు తహసీల్దారు సుబ్రహ్మణ్యంను మంగళవారం స్థానిక టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పరమశివం తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 20: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పదహారు కాళ్ల మండపంలో వెలసిన ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. సింధూరం దిద్ది పుష్పాలతో అలంకరించారు. భక్తులు తమలపాకుల మాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వరదయ్యపాళెంలో మోస్తరు వర్షం

వరదయ్యపాళెం, ఆగస్టు 20: వరదయ్యపాళెం మండలంలో మంగళవారం మోస్తరు వర్షం పడింది. ఈదురుగాలుల, పిడుగులు, ఉరుములతో కూడిన వర్షం పడడంతో కాసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

బాడీ బిల్డింగ్ పోటీల్లో కొల్లడంవాసి ప్రతిభ



వరదయ్యపాళెం, ఆగస్టు 20: దక్షిణ భారత బాడీ బిల్డింగ్ పోటీల్లో సత్యవేడు మండలం కొల్లడం గ్రామానికి చెరందిన ఎంపీటీసీ సెల్వి రమణ కుమారుడు సునీల్ ప్రథమ స్థానంలో నిలిచాడు. తమిళనాడులోని కవర్పేట ఎంజే కల్యాణ మండపంలో ఈనెల 18న దక్షిణ భారత బాడీ బిల్డింగ్ పోటీలు జరిగాయి. చెన్నై, కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, పాండిచేరి రాష్ట్రాల నుంచి సుమారు 40మంది బాడీ బిల్డర్స్ పాల్గొన్నారు. తమిళనాడులో బీటెక్ చదువుతున్న సునీల్ ప్రథమస్థానంలో నిలిచాడు. నిర్వాహకులు అతనికి బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, టీడీపీ మండలాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాజీ అధ్యక్షుడు పరమశివం తదితరులు సునీల్‌ను అభినందించారు.

దోమ కాటు వల్లే ప్రాణాంతక వ్యాధులు

వరదయ్యపాళెం, ఆగస్టు 20: మూడు రకాల దోమ కాటు వల్లే ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తున్నాయని సత్యవేడు మండలం దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యుడు మురళీకృష్ణ అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ అనాఫిలస్ దోమ వల్ల మలేరియా, డెంగ్యూ, ఈడేస్ దోమ వల్ల చికెన్‌గున్యా, చికెన్ ఫ్యాక్స్, క్యూలెక్స్ దోమ వల్ల ఎలిఫెంటిస్ వ్యాధి వస్తుందన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ప్రసూన, దాసుకుప్పం ఎంపీహెచ్‌ఈవో సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 20: మండలంలోని కొత్తపాళెం గ్రామంలో పాఠశాల విద్యార్థులతో కలసి వైద్య సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ దివాకర్ మాట్లాడుతూ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా జ్వరాలు అనాఫిలస్ దోమ వల్ల వ్యాపిస్తాయన్నారు. రోజు విడిచి రోజు, వణుకుతో కూడిన జ్వరం, తలనొప్పి, రక్తహీనత వంటివి వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన టీడీపీ నేతలు



ఏర్పేడు, ఆగస్టు 20: కేంద్రమంతి కింజారపు రామ్మోహన్ నాయుడును శ్రీకాకుళంలో మంగళవారం సాయంత్రం ఏర్పేడు మండలానికి చెందిన టీడీపీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. కేంద్రమంత్రిని సన్మానించి శ్రీకాళహస్తీశ్వరస్వామి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మణి మొదలియార్, మల్లికార్జున నాయుడు పాల్గొన్నారు.

వేడుకగా కాలభైరవస్వామి ప్రాకారోత్సవం

శ్రీకాళహస్తి, ఆగస్టు 20: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు మేళతాళాల మధ్య అభిషేకాలు ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. కాలభైరవ స్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయ స్థూపం వరకు వెళ్లి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువుతీర్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

శ్రీకాళహస్తి, ఆగస్టు 20: శ్రీకాళహస్తి మండలం ఊరందూరు దళితవాడకు చెందిన సాయిచరణ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దళితవాడకు చేరుకుని సాయి చరణ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.